క్లుప్తంగా

రక్తదానం



నందిపేట్(ఆర్మూర్) : అయిలాపూర్‌లో పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. భక్త మార్కండేయ జయంతిని పురస్కరించుకుని రక్తదాన శిబిరంతో పాటు మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. 35 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి జ్ఞాపికలు అందజేశారు. ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. రుధిర బ్లడ్ బ్యాంకు సిబ్బంది, పద్మశాలి యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



మాక్లూర్: చిక్లీ గ్రామానికి చెందిన బోదాస్ మధులతకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.48 వేల చెక్కును ఆదివారం బీఆర్‌ఎస్ యూత్ మండల ఉపాధ్యక్షుడు దీమేర శ్రీకాంత్ అందజేశారు. మధులత గతంలో అనారోగ్యం పాలై ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకుని కోలుకుంది. సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా డబ్బులు మంజూరు అయ్యాయి. సంబంధిత చెక్కును ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు అందించారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన బుక లావణ్యకు కూడా రూ. 20 వేలు మంజూరు కావటంతో చెక్కును అందించారు. ఉప సర్పంచ్ గుండు రవి, భోజన్న, మైనార్టీ నాయకుడు షేర్‌ఖాన్, ఫరీద్‌లు పాల్గొన్నారు.

పరామర్శ



నవీపేట: నవీపేట మాజీ సర్పంచ్ తెడ్డు పోశెట్టి తల్లి ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావ్ ఆదివారం పరామర్శించారు. కుటుంబ సభ్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నవీపేట సొసైటీ వైస్ చైర్మన్ దొంత ప్రవీణ్, మాజీ ఎంపీపీ సూరి బాబు, బీఆర్‌ఎస్ నాయకులు సంజీవ్‌రావ్, పోతన్న, గంగాధర్, బబ్లూ పాల్గొన్నారు.

మల్కాజ్‌గిరి ఎమ్మెల్యేకు సన్మానం



నిజామాబాద్‌నాగారం: మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావును నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా వారి నివాసంలో ఆదివారం ప్రత్యేకంగా సత్కరించారు. ఇందులో బిఆర్‌ఎస్ అభివృద్ధి గురించి చర్చించుకున్నారు.

ఎమ్మెల్సీ యాదవరెడ్డికి..



సిరికొండ: సిద్దిపేట జిల్లా గజ్వేల్‌కు చెందిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఒంటేరు యాదవ రెడ్డిని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నారవోయిన.శ్రీనివాస్ సన్మానించారు. మండలంలోని పెద్దవాల్గోట్ గ్రామంలో ఆది వారం బంధువుల ఇంటికి వచ్చిన ఎమ్మెల్సీని శ్రీనివాస్ కలిసి అభినందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎక్సైజ్ సీఐ వడియాల వెంకట నర్సింహారెడ్డి, వీరేందర్‌రెడ్డి, నరసింహారెడ్డి, సత్యంరెడ్డి, బాగారెడ్డి, సతీష్ రెడ్డి,శేఖర్, నసీర్ తదితరులు పాల్గొన్నారు.

త్యాగరాజ ఆరాధన మ్యూజిక్‌లో జిల్లా విద్వాంసులు



నిజామాబాద్ సిటీ: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన త్యాగరాజ ఆరాధన మ్యూజిక్ వేడుకల్లో జిల్లా విద్వంసులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన గురునాథ్ బృందం పాల్గొని సన్నాయి, వాయిద్యాలతో ప్రేక్షకుల మన్ననలు పొందారు. ఈ సందర్భంగా బృందానికి కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

జోరందుకున్న రోడ్డు పనులు

- ముప్కాల్ మండల కేంద్రంలో రోడ్డుకు రూ.5 కోట్ల నిధులు మంజూరు



ముప్కాల్ మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు చేస్తున్న దృశ్యం

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రానికి కొత్త శోభ తీసుకురావడం కోసం మండల కేంద్రంలో నాలుగు లేన్ల రోడ్డుతో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో పనులు జోరందుకున్నాయి. మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు పనులు, సెంట్రల్ లైటింగ్ కోసం మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి రూ.5 కోట్ల నిధులను మంజూరు చేయించారు. ఈ నెల 4న పనులకు శంకు స్థాపన చేశారు. వారం రోజుల వ్యవధిలోనే పనులు ప్రారంభమయ్యాయి. ఇది వరకే బాల్కొండ మండల కేంద్రంలో డబుల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ నిర్మించారు. దీంతో బాల్కొండకు కొత్త శోభ వచ్చింది. ముప్కాల్ మండల కేంద్రంలో కూడా పనులు పూర్తయితే నూతన శోభ వస్తుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రోడ్డు వెడల్పు కోసం ఇరువైపులా మట్టి తవ్వకాలు, ఆ ప్రాంతంలో కాంక్రీట్ వేసి రోడ్డును చదును చేయిస్తున్నారు. రోడ్డు పనులు పూర్తయిన తరువాత ఇరువైపులా మొక్కలను పెంచటానికి అధికారులు చర్యలు చేపడతామని అంటున్నారు. రోడ్డు వెడల్పు పనులను మరింత వేగవంతం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బీఆర్‌ఎస్ పార్టీని విస్తరింపజేయాలి

- తెలంగాణ పథకాలను మహారాష్ట్ర సరిహద్దులో అమలు చేయాలి
- మల్కాజ్‌గిరి ఎమ్మెల్యేను కోరిన మహారాష్ట్రవాసులు



మల్కాజ్‌గిరి ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పిస్తున్న సరిహద్దు ప్రాంతాల నాయకులు

నవీపేట : మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలలో బీఆర్‌ఎస్ పార్టీని విస్తరింపజేయాలని సరిహద్దు ప్రాంతాలలోని 30 గ్రామాలకు చెందిన నాయకులు ఆదివారం మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావ్‌కు వినతి పత్రం సమర్పించారు. మండలంలోని జన్నెపల్లిలోని ఎమ్మెల్యే గెస్ట్ హౌజ్‌లో ఆయనను కలిసి తమ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. రానున్న సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలలో బీఆర్‌ఎస్ అభ్యర్థులను బరిలోకి దించాలని అధిక మెజారిటీతో గెలిపిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో అమలు చేస్తున్న పలు అభివృద్ధి పథకాలను అమలు చేయాలని కోరారు. సరిహద్దు ప్రాంతాల విజ్ఞాపనను సీఎం దృష్టికి తీసుకెళ్తానని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు. సరిహద్దు ప్రాంతాల అభివృద్ధి కమిటీ చీఫ్ కన్వీనర్ గంగాధర్ ప్రచండ్, పలు గ్రామాల మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల దీక్షలు



బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ప్రకటించాలని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. ఆదివారం నాటికి న్యాయవాదుల దీక్షలు 35 వ రోజుకు చేరాయి. దీక్షలో న్యాయవాదులు కులకర్ణి దత్తాత్రిరావు, అర్జున్ రండార్‌లు కూర్చున్నారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గంగారెడ్డి, న్యాయవాది అడ్లూరి శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఖాజా ఫయాజుద్దీన్‌లు పాల్గొన్నారు.

అవకతవకలపై నివేదిక ఇవ్వండి

- అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్

బోధన్‌టౌన్(బోధన్) : బోధన్ మున్సిపాలిటీలో జరుగుతున్న అవకతవకలపై దృష్టి సారించి నివేదికను అందించాలని ఆర్డీవో రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ హైమద్‌లను ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆదేశించారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లతో సమీక్ష నిర్వహించారు. బల్దియాలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పట్టణ ప్రగతిలో జరిగిన అభివృద్ధి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనులు జరగకుండా పెండింగ్ ఎందుకు ఉన్నాయని, కారణాలు తెలియజేయాలని అధికారులకు సూచించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలన్నారు. సమీక్షా సమావేశంలో తహసీల్దార్ వరప్రసాద్, హౌసింగ్ ఏఈ నాగేశ్వర్‌రావు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్, ఫ్లోర్ లీడర్ రాధాకృష్ణ, కౌన్సిలర్లు దూప్‌సింగ్, ఇంతియాజ్ పాల్గొన్నారు.

నాయకపోడు భవన నిర్మాణానికి భూమి పూజ



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్‌లో ఆదివారం ఆదివాసి నాయకపోడు సంఘ భవన నిర్మాణానికి సర్పంచ్ ఇందూర్ సాయన్న భూమిపూజ చేశారు. గ్రామంలో నాయకపోడు సంఘ భవన నిర్మాణానికి ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి రూ.5 లక్షల నిధులు మంజూరు చేశారు. దీంతో సర్పంచ్ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్, వార్డు సభ్యులు, నాయకపోడు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహుడ్ని దర్శించుకున్న ప్రముఖులు



పూజలు చేస్తున్న ఎంపీ లింగయ్య యాదవ్

ఎడపల్లి(బోధన్): జాన్కంపేట లక్ష్మీనృసింహ స్వామి ఆలయాన్ని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ మద్దుల నాగేశ్వరరెడ్డిలు ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పురం సాయిలు ఆలయ విశిష్టత గురించి వారికి వివరించారు. అష్టముఖి కోనేరును కూడా వారు దర్శించుకున్నారు. సూర్యాపేట మార్కెట్ చైర్మన్ సుధీర్‌రావు కూడా దర్శించుకున్నవారిలో ఉన్నారు.

లక్ష్మీనర్సింహ ఆలయ హుండీ ఆదాయం రూ.లక్ష

ఎడపల్లి(బోధన్): జానకంపేటలోని లక్ష్మీనర్సింహ స్వామి ఆలయానికి శనివారం అమావాస్య పురస్కరించుకుని భక్తులు హుండీలో కానుకలు వేశారు. హుండీ ఆదాయం రూ. లక్ష 350 వచ్చినట్లు ఆలయ సిబ్బంది తెలిపారు. కొబ్బరికాయలు, లడ్డూ, పులిహోరా, కుంకుమార్చన, సైకిల్ స్టాండ్ ఆదాయం రూ.1,44,130 వచ్చినట్లు ఆలయ పరిశీలకులు కమల, కార్యనిర్వాహక అధికారి వేణు తెలిపారు.

'చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి'

ఆర్మూర్: మహిళల రక్షణ కోసం చేసిన చట్టాలను ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయాలని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆమె సాక్షితో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో ఉన్నత స్థాయిలో ఉన్న ఐఏఎస్ అధికారిణి స్మిత సబర్వాల్‌పై జరిగిన దాడిని ఆమె ఖండించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో అధికారిణిగా కొనసాగుతున్నప్పటికి పరిపాలనలో ఉన్న లోపాలను ఆమె బట్టబయలు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ఐఏఎస్ అధికారిణికే రక్షణ కరువైనప్పుడు రాష్ట్రంలోని సాధారణ మహిళల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని రాంనగర్‌లో పద్మశాలి సంఘం 5వ తర్ప రూపొందించిన 2023 సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో తర్ప అధ్యక్షులు కట్కం నరేందర్, కార్యదర్శి బోగ గంగాధర్, కోశాధికారి పెంట పురుషోత్తం, పట్టణ సంఘం ప్రతినిధి ఆడెపు ప్రభాకర్, ఉపాధ్యక్షుడు గొరిటాల శ్రీనివాస్, సహాయకార్యదర్శులు గెంట్యాల గణేశ్, కొండ గంగాధర్, సాంస్కృతిక కార్యదర్శి సదామస్తుల సత్యనారాయణ, ప్రచార కార్యదర్శి పట్వారి తులసి కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా గో-వృషభ కల్యాణోత్సవం



రుద్రూర్ గోశాలలో కల్యాణం

రుద్రూర్: మండల కేంద్రంలోని గోశాలలో ఆదివారం నూతనంగా నిర్మించిన షెడ్డును బాలయోగి పిట్ల కృష్ణ మహరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గో-వృషభ కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీ గాయత్రి, మహా మృత్యుంజయ యజ్ఞం నిర్వహించారు. భజనలతో గోశాల మారుమ్రోగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పిట్ల కృష్ణ మహరాజ్ భక్తులకు ప్రవచనాలు చెప్పారు. హిందు సంస్కృతిలో గోమాత ప్రాధాన్యం, గో సేవ గురించి వివరించారు. స్థానిక సర్పంచ్ ఇందూర్ చంద్రశేఖర్, బచ్చు రాము, కర్కె అశోక్, కొలాస్ గంగాధర్ పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం



శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

బోధన్‌టౌన్(బోధన్): ప్రతి రోజు యోగా చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని జయించవచ్చని యోగా శిక్షకులు గంగాధర్ అన్నారు. పట్టణంలోని ఆర్య సమాజ్‌లో యోగ శిక్షణా శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. ఈ యోగా శిక్షణలో భాగంగా ఆదివారం బినోలలోని 108 శివలింగాలను దర్శించుకున్నట్లు చెప్పారు. దీంతో పాటు సమీపంలోని ఆలయాలు, వాల్మీకి సమాధిని దర్శించుకుని వాటి చరిత్రను విద్యార్థులకు వివరించినట్లు వెల్లడించారు.

సీఎస్‌ఐ డైసీస్ ప్రతినిధులకు సన్మానం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మూగ చెవిటి పాఠశాలలో డైసీస్ ప్రతినిధులను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఇటీవలే నూతనంగా ఎన్నికైన చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా మెదక్ సెక్రటరీ ప్రభు కిరణ్ కుమార్(లల్లు), మెదక్ డైసీస్ ప్రాపర్టీ సెక్రెటరీ మంత్రి సాల్మన్ రాజ్, రిజిస్ట్రార్ శైలేందర్‌ను మూగ చెవిటి పాఠశాల కన్వీనర్ సువర్ణ కిరీటి పూలమాల, శాలువాలతో సత్కారించారు. అదేవిధంగా సెయింట్ పీటర్స్ చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న అనంతరం చర్చి పస్ట్రేట్ కమిటీ సభ్యులు సైతం ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ప్రభు కిరణ్ మాట్లాడుతూ.. సేవా భావంతో మూగ చెవిటి పాఠశాల కొనసాగుతుందని, ఎందరో చెవిటి విద్యార్థులకు మార్గదర్శకంగా నిలిచిందన్నారు. ఎలాంటి సమస్యలైనా పరిష్కరించేందుకు బిషప్‌తో సంప్రదించి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. చర్చి రెవరెండ్ డాక్టర్ మన్నే శ్రీనివాస్, కమిటీ సభ్యులు జెస్సీ రాజ్, సత్య రమేష్, ఎస్తేర్ నాగమణి, గ్రేస్ నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతలకు జలాభిషేకం



కుద్వాన్‌పూర్‌లో గంగ నీళ్లను తీసుకువస్తున్న జాలర్లు , గ్రామస్తులు



కొటార్మూర్‌లో గంగా జలాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న వీడీసీ సభ్యులు

నందిపేట్(ఆర్మూర్): కుద్వాన్‌పూర్‌లో దేవతా మూర్తులకు జలాభిషేకం, జాతరను నిర్వహించారు. ఉదయం డప్పు వాయిద్యాలతో వన్నెల్ శివారులోని గోదావరి నది ప్రాంతానికి వెళ్లి గంగాజలాన్ని తీసుకు వచ్చారు. గ్రామంలో ఊరేగింపు చేయగా బేస్తవారు జాలర్లతో తమ ప్రదర్శనను చేశారు. అనంతరం మొక్కులు తీర్చుకున్నారు. సర్పంచు సాయన్న, ఎంపీటీసీ అన్నగౌడ్ గోదావరి ప్రవీణ్‌గౌడ్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

కొటార్మూర్‌లో..

పెర్కిట్(ఆర్మూర్): కొటార్మూర్‌లో ఆదివారం వీడీసీ ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరీవాహక ప్రాంతం నుంచి తీసుకు వచ్చిన గంగా జలాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. వీడీసీ అధ్యక్షుడు షేర్ల గంగాధర్, కోశాధికారి డేరా మోహన్, కార్యదర్శి శేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బోదేపల్లిలో..

బాల్కొండ: బోదేపల్లిలో ఆదివారం గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. ముందుగా పవిత్ర గోదావరికి కాలినడకన వెళ్లి గంగాజలాన్ని తీసుకువచ్చారు. అనంతరం గ్రామంలో వలగొడుగుతో, డప్పు వాయిద్యాల నడుమ భక్తితో గ్రామ దేవతలకు జలాభిషేకాలు చేసి బోనాలను సమర్పించారు. మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్ట పై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకి సేవ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.



బోదేపల్లిలో గంగ నీళ్లను తీసుకెళ్తున్న భక్తులు

పదోన్నతులు పారదర్శకంగా ఉండాలి

- తపస్ రాష్ట్ర ప్రతినిధి కర్నె శంకర్ డిమాండ్



బోధన్‌లో మాట్లాడుతున్న కర్నె శంకర్, నేతలు

బోధన్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో న్యాయపరమైన చిక్కులు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) రాష్ట్ర ప్రతినిధి కర్నె శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంలో తమ సంఘం రాష్ట్ర శాఖ ప్రభుత్వానికి పలు సూచనలు చేసిందన్నారు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించినంతరం బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని కోరారు. ఆదివారం పట్టణ కేంద్రంలో ఆయన స్థానిక నాయకులతో కలిసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన 317 జీవో ప్రకారం బలవంతంగా ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులకు సొంత జిల్లాలకు వచ్చే విధంగా ఉత్తర్వులు జారీ చేయాలని పేర్కొన్నారు. ఈ జీవోలో 13 జిల్లాలకు చెందిన స్పౌజ్‌లను వెంటనే వారు కోరుకున్న జిల్లాలకు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చొరవ తీసుకుని కోర్టు స్టేను తొలగించి భాష, వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులను అప్‌గ్రేడ్ చేసి హైకోర్టు తుది తీర్పుకు లోబడి పదోన్నతులు, బదిలీలు చేయాలని సూచించారు. ఐదు ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న గెజిటెడ్ హెచ్‌ఎంలకు తప్పని సరిగా బదిలీలు చేయాలన్నారు. బదిలీల ప్రక్రియను ఆన్‌లైన్‌లో ద్వారా నిర్వహించి, వెబ్ కౌన్సిలింగ్‌లో ఆప్షన్ ఇచ్చుకున్న వారికి పొరపాట్లు ఉంటే సరి చేసుకునేందుకు ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలని కోరారు. 40 శాతం అంగవైకల్యం, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు ప్రిఫరెన్స్ కేటగిరీలో ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. తపస్ జిల్లా ప్రతినిధి నగేష్, బోధన్, రెంజల్ మండల శాఖల అధ్యక్షులు సంజీవ్‌కుమార్, బ్రహ్మం పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా కుస్తీ పోటీలు



చందూర్‌లో జరుగుతున్న కుస్తీ పోటీలు

రుద్రూర్: చందూర్ మండల కేంద్రంలో అల్ల మాప్రభు ఆలయ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కుస్తీ పోటీలు ఏర్పాటు చేశారు. నువ్వా నేనా అన్న రీతిలో మల్లయోధులు తలపడ్డారు. కుస్తీ పోటీలు తిలకించడానికి సమీప గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. విజేతల కు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నగదు బహు మతి అందజేశారు. ఆలయ పరిసరాల్లో జాతర సాగింది. ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అ ర్ధరాత్రి అగ్ని గుండం ఏర్పాటు చేశారు. కోర్కె లు నెరవేరాలని అగ్ని గుండంపై నడిచారు.

ద్వారకానగర్ @ బంగారం

- ఇందూర్‌లో కార్పొరేట్ దుకాణాలు
- వివిధ రకాల మోడల్స్‌తో మహిళలను ఆకట్టుకుంటున్న వైనం

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌లో కొన్ని గల్లీలకు కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. ఖలీల్‌వాడిలో ఎక్కువగా ఆస్పత్రులు ఉంటాయి. కుమార్‌గల్లీ మహిళలు ధరించే దుస్తులు లభించే ప్రాంతం. పూసలగల్లీ బట్టల దుకాణాలకు ప్రసిద్ధి. ఆటోనగర్ వాహనాల రిపేర్, సెకండ్ హ్యాండ్ వాహనాలు, వస్తువులకు ప్రత్యేకత ఉంది. దీంతో ఇప్పుడు దేవిరోడ్డులో ఉండే ద్వారకనగర్‌లో జువెల్లరీషాపులు వెలుస్తున్నాయి. మార్వాడీగల్లీ, కుమార్‌గల్లీలో స్థానికుల జువెల్లరీ షాపులు ఉన్నాయి. ఇందులో స్థానికులు బంగారం వ్యాపారం చేస్తున్నారు. నిజామాబాద్‌లో ఈ ప్రాంతం బంగారానికి ప్రసిద్ధి. ఇప్పుడు ద్వారకానగర్‌లో అంతర్జాతీయ స్థాయిలో బంగారు షాపులు వెలుస్తున్నాయి. ఇక్కడ ప్రజలు బంగారానికి ఎక్కువగా ప్రాధాన్యత ఇవ్వడంతో బంగారం కొనుగోలు పెరగడంతో కార్పొరేట్ బంగారు షాపులు వెలుస్తున్నాయి. ఈ షాపుల్లో రకరకాల డిజైన్‌లతో బంగారు అభరణలు ఉండటంతో మహిళలను ఎక్కువగా అకర్షిస్తున్నాయి. ఇక్కడికి నిర్మల్, జగిత్యాల, కామారెడ్డి జిల్లాల నుంచి కొనుగోలు చేయడానికి వస్తున్నారు. ఇక్కడ సేల్స్ పెరిగిపోవడంతో అన్ని రకాల కార్పొరేట్ బంగారు దుకాణాలు క్యూ కడుతున్నాయి.